"గురువుగారూ! మీతో ఒక విషయం చెప్పాలి."

"అర్జెంటా?"

"చాలా!"

"అయితే ఐదు నిమిషాల్లో తేల్చేయ్."

"మన కాంతి లేదండీ? అదే—ఎకౌంట్ సెక్షను."

"ఊఁ."

"నిన్న సుబ్బారావుతో సినిమా హాల్లో కనిపించింది."

'ఎకౌంట్స్ కాంతి, డిస్పాచ్ సుబ్బారావు!' అని గట్టిగా సిగరెట్ దమ్ము లాగి, "సరే. ఇపుడు కొంచెం పనుంది. నాలుగున్నరకి వచ్చేయ్. పోదాం" అని గోపాలరావు ఆదేశించాడు.

"అలాగేనండి." ప్రియ శిష్యుడు సుందరమూర్తి.

అప్పటినుంచి గోపాలరావు మనసు పని చెయ్యనని మొరాయిస్తోంది. గోపాలరావు 'ఇ' సెక్షన్‌లో యు. డి. సి. చాలా పలుకుబడి ఉన్న వ్యక్తి. రచయితగా బాగా పేరు తెచ్చుకున్నాడు. గోపాలరావును పిచ్చిగా ఆరాధించే శిష్యుడే సుందరమూర్తి. ఆఫీసులో ఎలుకల పోట్లాట దగ్గరి నుంచి మానేజింగ్ డైరెక్టర్ ఆ ముందు రోజు ఏ మందు సేవించారో కూడా చెబుతూంటాడు. అవసరమైతే గూఢచారిలా పరిశోధనలు సాగిస్తూంటాడు. గోపాలరావుకు అనుంగు శిష్యుడు, ఆప్తుడు, ఇంకా చాలా చాలా. ఏమైనా సుందరమూర్తి స్వతహాగా మంచివాడు.

# మై డియర్ లోఫర్!

'సత్యవోలు'



ఆశనికి ఉన్న ఒకేఒక బలహీనత రచయితలను గౌరవించడం, వారికి శుశ్రూష చేయడం. గోపాలరావు వ్రాసిన ఒకానొక నవల చదివి, అంతమంచి నవల వ్రాసిన గోపాలరావు ఇంకెంత మంచివాడో అనుకొన్నాడు. ఆ పైన భక్తుడయ్యాడు. ప్రస్తుతం గోపాలరావు వ్రాసిన ప్రతిది ఫెయిర్‌కాపీ చేస్తున్నాడు.

సాయంత్రం నాలుగున్నర అయింది. గోపాలరావు, సుందరమూర్తి రోడ్డెక్కేశారు.

"ఒక స్ట్రాంగ్ కాఫీ తాగుదాం, మూర్తీ!"

"అలాగేనండి."

ఒక రెస్టారెంటులోకి ఇద్దరూ దూరి మూలగా ఉన్న ఒక టేబుల్ దగ్గర కూర్చున్నారు.

"మూర్తీ! కాంతి చాలా అందంగా ఉంటుంది కదూ?"

"అవునండి."

"మంచి పెర్సనాలిటీ. ఆ కళ్ళు, ఆ ముక్కు తీరు, విశాలమైన నుదురు, చిన్నినోరు చాలా ఆకర్షిస్తాయి. అస లా నడక చూస్తేనే మనసు అదుపు తప్పుతుందనుకో. ఆమె మాటలే సుబ్బారావుని కొంగుని కట్టేశాయనుకుంటా."

సుందరమూర్తి ఎటో చూస్తున్నాడు. ముఖమంతా గంభీరంగా మారుతున్నది.

"ఏమిటోయ్, మూర్తీ, అలా ఉన్నావ్?"

"మీరు ఆ అందాలన్నీ ఎప్పుడు చూశారు?"

"అదేమిటోయ్! మన పుట్టుకే రచయిత పుట్టుక. వద్దనుకున్నా కళ్ళు అందాల దగ్గిరికే పోతాయి."

"అది సరే, రావుగారూ! మీ కథ పూర్తి అయిందా?"

"ఆఫీసులో చాలావరకు వ్రాశాను. రేపు పూర్తి అవుతుంది. కథ దేముంది? ముందు అందాలరాశి కాంతిని చిక్కించుకోవాలి."

"అదేమిటి అలా అంటున్నారు?" సుందరమూర్తి చాలా సీరియస్‌గా అన్నాడు.

"చెప్పేది జాగ్రత్తగా విను. కాంతికి పెళ్ళి కాలేదు. సుబ్బారావుకి పెళ్ళి అయింది. సుబ్బారావుకు పెళ్ళి అయిన సంగతి కాంతికి తెలుసు. ఎలా అంటే సుబ్బారావు ఇంటి పక్కనే కాంతి ఉంటుంది. పెళ్ళి అయిన సుబ్బారావుకూడా కాంతి సినిమాలకు, షికార్లకు తిరుగుతూందంటే ఆమె అటువంటి మనుషులను కోరుకుంటూన్న దన్నమాట!"

"ఇదంతా నిజమేనంటారా?" మూర్తి సందేహం.

"అందుకే నిన్ను కుర్రవాడివి అంటానోయ్. ఇటువంటి విషయాలను ఖచ్చితంగా అంచనా వేయడం నాకు వెన్నతో పెట్టిన విద్య."

"సరేనండి. రేపు కలుస్తా. మా అక్కయ్య ఇంటికి వెళ్ళాలి. చాలా అర్జెంట్ పని ఉంది."

"అప్పుడే వెళతానంటున్నా వేమిటి? ఓ! నాక్కూడా ఒక పని ఉందోయ్. అది సరే — నీ దగ్గర ఏమైనా డబ్బు ఉందా?"

"అబ్బే! ఎక్కువ లేదండీ. ఒక పది ఉందంతే."

"ఒక పని ఎద్దాం. పది మార్చి అయిదు నేనూ, మిగిలిన అయిదు నువ్వూ తీసుకుందాం."

"సరేనండి."

• • •

మూర్తి చాలా నీరసంగా కూర్చున్నాడు. టేబిల్ మీద చాలా పని పెండింగులో పడి ఉంది. అది రెండు రోజుల్లో పూర్తి చెయ్యాలి. పది నిమిషాలు ఏదో పని చేశాడు. విసుగనిపించింది. అస లీ జ్వరం వస్తేనే ఇంత. తన మీద తనే

కొన్నట్టున్నాడు. వారం రోజుల సెలవు అనంతరం ఆ రోజే డ్యూటీలో జాయిన్ అయ్యాడు. ఈ లోగా సుబ్బారావు వచ్చాడు.

"జ్వరం తగ్గిందా?"

"ఆఁ. వదిన ఊరునుంచి వచ్చిందా?"

"నిన్ననే వచ్చింది." సుబ్బారావు చెప్పాడు.

"కాఫీ తాగుదామా?" మూర్తి అడిగాడు.

"ఆఁ పద. కాంటీన్‌కి పోదాం." సుబ్బారావు కదిలాడు.

కాంటీన్‌లో కాఫీ తాగుతూ అన్నాడు సుబ్బారావు: "మీ గ్రేట్ రచయిత గోపాలరావు ఏం చేశాడో తెలుసా?"

"ఏం చేశాడు? ఆయనంటే మీకు ఎందుకంత కోపం?" మూర్తి కంగారు పడ్డాడు.

"వాడి మీద కోపం ఎందుకు! వాడు చేసే పన్ని వెధవ పనులే—అందుకే చిరాకు."

"ఏం చేశాడు?"

"ఈ మధ్య వారం రోజులు సెలవు పెట్టి మా వూరు వెళ్ళాను. నేను వెళ్ళిన మూడు రోజులకు కాంతి ఎందుకో సెలవు పెట్టిందట. మేమిద్దరం నిన్ననే డ్యూటీలో జాయిన్ అయ్యాం. ఆఫీసు లోకి వస్తూంటే అంతా వింతగా చూడటం మొదలు పెట్టారు. ఏదోలే అని పట్టించుకోలేదు. ఒక గంట గంటన్నర పోయాక కాంతి హాఫ్‌డే సెలవు పెట్టి వెళ్ళింది. అంతకు ముందు లంచ్ రూమ్‌లో ఏడిచిందట." సుబ్బారావు చెబుతూండగానే—

"ఏం? ఎందుకు ఏడవడం?" అని మూర్తి అడిగాడు.

"ఏముండి! మీ మహారచయిత శ్రీ గోపాలరావుగారు సృష్టించాడుగా ఒక కథ?" సుబ్బారావు చిరాకుగా అన్నాడు.

"ఏం కథ?" సీరియస్‌గా అడిగాడు మూర్తి.

"కాంతి, నేనూ పెళ్ళి చేసుకోవడానికే సెలవు పెట్టి వెళ్ళినట్టూ, ఆ పైన ఏ గుడిలోనో పెళ్ళి చేసుకుని, ఏ లాడ్జిలోనో మొదటి రాత్రి గడిపినట్టూ, మా ఆవిడకి నేను విడాకులు ఇచ్చేసినట్టూ—ఇంకా ఏం చెప్పాడో తెలుసా? కాంతితో కొత్త కాపురం శ్రీనగర్‌కాలనీలో పెట్టినట్టూ. వాణ్ణి ముక్కలు విరగ్గొడదామనుకున్నాను." సుబ్బారావు ఆగాడు.

"నిన్ను వదిలేసిన వదిన కోర్టుకెక్కినట్టూ, నువ్వు జైలు కెళ్ళినట్టూ ఆ కథలో లేదా?" సుందరమూర్తి చాలా గంభీరంగా అన్నాడు.

సుబ్బారావుకు ఏమీ అర్థం కాలేదు.

మూర్తి లేచి నిలబడ్డాడు.

"నేను వస్తా" అని చెప్పి గబగబా వెళ్ళిపోయాడు.

'ఏమిటో! గోపాలరావును ఒక్క మాట అంటే చాలు—వీడు ఎగిరెగిరి పడతాడు. ఏ మభిమానమో?' ఒక నిట్టూర్పు విడిచాడు సుబ్బారావు.

* * *

"ఏమోయ్! చాలా చిక్కిపోయావ్! మీ ఇంటికొద్దామని రోజూ అను కొనేవాణ్ణి. కాని, కుదిరి చావలేదు." గోపాలరావు అన్నాడు.

"ఆఁ ఫర్వా లేదు లెండి. బాగానే ఉన్నాగా?" మూర్తి.

"అవును. నెల్నాళ్ళు సెలవు పెట్టావట. నిజమా?" గోపాలరావు అడిగాడు.

"నిజమండీ!"

"ఎందుకు?"

"ఆఁ ఎరన్డ్ లీవు ఉంది కదా అని!" మూర్తి చెప్పాడు.

"నీ కో సంగతి తెలుసా?"

"మీ కథ సంగతేనా?"

"అది నీ వరకూ వచ్చిందా?"

"మీ కథ నాకు తెలియడ పోవడమేమిటి!" ఎగతాళిగానే అన్నాడు.

"అదేమిటోయ్ అలా అంటున్నావ్?"

"ఏం లేదండి. కొంచెం పనుంది. మళ్ళీ కలుస్తా" అని వెళ్ళి పోయాడు మూర్తి. ఆ తరవాత సెలవు మీద వెళ్ళేటప్పుడు గోపాలరావుకు చెప్పలేదు శిష్యుడు. అలా ఎందుకు చేశాడో బోధ పడక తికమక పడ్డాడు గోపాలరావు.

నాలుగైదు రోజుల తరవాత గోపాలరావుకు ఒక కవరు వచ్చింది. ముత్యాల్లాంటి అక్షరాలతో తన పేరు ఉంది. ఫ్రమ్ కాంతి అని ఉంది. గోపాలరావు మనసు ఒక్కసారి ఆకాశంలో విహరించి చక్కిలిగింతలు పెట్టింది. ఒక సిగరెట్ వెలిగించి, గట్టిగా దమ్ము లాగి, పొగ వదులుతూ ఉత్తేజం పొందుతున్నాడు. కవరు చింపగానే ముఖం వెలవెల బోయింది. శుభలేఖ కనిపించింది. కంగారు పడ్డాడు గోపాలరావు. శుభలేఖ మడతలోనే లోపల ఒక ఉత్తరం బయట పడింది. అది తీసుకుని చదివాడు.

"మై డియర్ లోఫర్!

నిన్ను రచయితగా గౌరవించాను. మనసులో మంచి స్థానం ఇచ్చాను. కాని, నువ్వు రచయిత అనే పదానికే అనర్హుడివి. ఒక నీతి, నియమం, సిద్ధాంతం లేని మనిషివి. తప్పతాగి, ఆ తాగుడు మైకంలో రచనలు చేసి, మంచి రచయితగా నువ్వు చలామణి కావడం మా ఖర్మ. నీ అలవాట్ల సంగతి గాలికి వదిలినా—నీ గుణం చాలా హీనమైనది. దానిని వర్ణిస్తే ఒక పెద్ద గ్రంథమే అవుతుంది. నేటి




సమాజానికి కావలసింది మాటలు, మత్తు రాతలు కాదు. నిర్మాణాత్మకమైన పనులు. అవి నువ్వు చెయ్యలేవు.

నిన్ను అభిమానించాను. పూజించాను. నిన్ను ఎవరైనా ఏదైనా అంటే వారితో దెబ్బలాడి విరోధం తెచ్చుకున్నాను. ఆఖరికి సుబ్బారావు—కాంతి విషయంలో నన్ను నేనే పరీక్షకు పెట్టుకున్నాను. నీ కుటిలత్వం, దౌర్బల్యం బయట పడ్డాయి. నా నమ్మకాన్ని బూడిద చేశావు. అన్నా చెల్లెళ్ళకే అక్రమ సంబంధాలు పెట్టే నీ లాంటి నికృష్టుడితో ఇంత కాలం స్నేహం చేసినందుకే చాలా బాధ పడుతున్నాను. నీ రచనలన్నీ డబ్బు కోసమే అయితే నీకూ, వేశ్యకూ తేడా ఏమిటి?

ఇట్లు
సుందరమూర్తి."

ఆ సాయంత్రం గోపాలరావు—సుబ్బారావు, కాంతి అన్న దమ్ముల బిడ్డలని; సుందరమూర్తి వాళ్ళ మేనమామ కొడుకని తెలిసి బాధ పడుతూ, ఒక క్వార్టర్ రమ్ తాగి, కాంతి తనకు దక్కకుండా సుందరమూర్తికి దక్కినందుకు విచారిస్తూ ఇంటి దారి పట్టాడు. ★